ఎండుతున్న పంటలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- బోర్లు వేయిస్తున్నా చుక్కనీరు రాని వైనం
- పంటలను కాపాడుకునేందుకు అవస్థలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఎండిన వరిపంటను చూపిస్తున్న రైతు చేగొండ కొమురయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): యాసంగి పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో వ్యవసాయ బావులు, బోరుబావుల్లో నీటి ఊటలు అడుగంటిపోయాయి. కొద్దిపాటి నీటితో వరి పంటలు, కూరగాయలు, ఆరుతడి పంటలకు వరుస తడులతో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటి కోసం బోర్లు వేయిస్తున్నారు. దాదాపు 450 మీటర్ల లోతు బోర్లు వేయించిన చుక్కనీరు రావడంలేదని రైతులు చెబుతున్నారు. పంటలకు నీటి తడులు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అంతక్కపేట, ధర్మారం, పోతారం(జే), రామవరం, నందారం, కపూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండా, రేగొండ, గోవర్ధనగిరి, గౌరవెల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరిపంటలు ఎండిపోయి పశువులకు మేతగా మారాయి. ఎన్నడూ లేని విధంగా ఈసారి పంటలు చేతికి వచ్చే సమయంలో ఎండిపోవడంతో రైతులు ఆందోన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా 15 నుంచి 22 బోర్లు వేయించినా చుక్క నీరు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న పొలాలు

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడటంతో చెరువులు, కుంటలు నిండాయి. యాసంగి ప్రారంభంలో కూడా అవి నీటితో కళకళలాడటంతో వరి సాగు చేశారు. ఎండలు పెరుగుతున్న తరుణంలో చెరువుల్లో నీటిమట్టం తగ్గుతోంది. బోర్లు వేయించినా నీరు రావడంలేదు. దీంతో బోరుబావుల కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి.



చిన్నగుబ్బడిలో 450 మీటర్ల లోతులో బోరు వేసిన నీరు రాకపోవడంతో మూసిన దృశ్యం

భూగర్భజలాలు అడుగంటాయి

ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటాయి. పంటలు ఎండిపోకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండిన పంటల వివరాలు, సర్వే చేయాలని మాకు ఆదేశాలు రాలేదు. వరి పంటలు కోతకుముందే భూగర్భ జలాలు అడుగంటిపోవడం విచారకరం.

– నాగరాజు,
ఏఓ, అక్కన్నపేట మండలం

యాసంగి వరి సాగు వివరాలు	
2023లో..	12,031 (ఎకరాలు)
ప్రస్తుతం..	15,600 (ఎకరాలు)
ఆరుతడి పంటలు..	6,090 (ఎకరాలు)

వరి పంట పూర్తిగా ఎండి పోయింది

రెండు ఎకరాల్లో సాగు చేసిన వరిపంట పూర్తిగా ఎండిపోయింది. మడిమడికి నీళ్ల పారించిచా చివరిగా ఒక మడి మాత్రమే దక్కింది. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బావిలో నీరు లేదు. పంటల సాగుకు చేసిన పెట్టుబడి ఖర్చులైన ప్రభుత్వం నష్టపరిహారంగా అందించాలి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం. ఇలాంటి పరిస్థితి వస్తుందనుకోలేదు.

– చేగొండ కోమురయ్య,
అంతక్కపేట గ్రామ రైతు

క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బోరింగ్ తండా వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గండిపల్లి గ్రామ పరిధి బోరింగ్ తండా మీదుగా దేవానాయక్ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బోరింగ్ తండా వద్ద రోడ్డుకు ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఏమరుపాటుగా ఉంటే వాహనదారులు, పాదచారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీపీఎంను గెలిపించండి

జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

మద్దూరు(హుస్నాబాద్): ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దూళ్మిట్ట మండల కేంద్రంతోపాటు జాలపల్లి గ్రామంలో ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు కీలకం కానున్నాయన్నారు. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మతోన్మాదాన్ని ప్రోత్సహించడమేకాకుండా దేశ సంపదను కార్పొరేట్ శక్తుల చేతులో పెట్టిందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



తూం శేఖర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: మండల పరిధి కోమటిబండ గ్రామ మాజీ సర్పంచ్ తూం శేఖర్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. తూం శేఖర్ తల్లి సుగుణమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గ్రామానికి చేరుకొని ఆయనను పరామర్శించి సంతాపం తెలిపారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు గుంటుకు శ్రీను, భాస్కర్, గ్రామస్తులున్నారు.

సన్నాహక సమావేశానికి కాంగ్రెస్ శ్రేణులు



జనగామ వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామలో తలపెట్టిన భువనగిరి పార్లమెంట్ సన్నాహక సమావేశానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలి వెళ్లారు. వెళ్లినవారిలో కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురామ్ శుక్రవారం తెలిపారు. మండల పరిధి ధర్మారం రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆటోలో అక్రమంగా 10.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఘనంగా రుద్రాక్ష లింగార్చన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాక్ష లింగార్చన ఘనంగా జరిగింది. ఆలయం వద్ద రుద్రాక్షలతో లింగాన్ని ఏర్పాటు చేయగా, రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, మురళీధర్‌శర్మ, రవిప్రసాద్ శర్మ రుద్రాక్ష లింగార్చన నిర్వహించారు.

తీరిన భూ నిర్వాసితుల దాహం



భగీరథ వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన భూ నిర్వాసితుల దాహం ఎట్టకేలకు తీరింది. భూనిర్వాసితులు ఉంటున్న గౌరవెల్లి పరిధిలోని బంజారా హిల్స్‌తండాలో వద్ద 60 వేల లీటర్ల సామర్థ్యం, కుందనవానిపల్లి క్రాసింగ్ వద్ద 40 వేల లీటర్ల సామర్థ్యంగల మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను నిర్మించారు. శుక్రవారం ఈ ట్యాంకుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి ప్రాజెక్టులోని ఓ బావి నుంచి కిలో మీటర్ మేర పైపులైన్‌ల ద్వారా భగీరథ వాటర్ ట్యాంకులను నింపారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తాగునీటిని వృథా చేయొద్దన్నారు. తాగునీటి బోరుబావుల మోటార్లు కాలిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహిన తస్కిన్, ఏఈ మౌనిక, ముంపు గుడాటిపల్లి మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



దుబ్బాకలోని మహంకాళి అమ్మవారి ఆలయం

దుబ్బాక: పట్టణంలోని మహంకాళి దేవాలయంలో మూడు రోజులపాటు గణపతి సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరగనున్నాయి. 13వ తేదీ ఉదయం యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా స్వస్తి వాచనము, రుత్విక్వరణం, అఖండ దీప స్థాపన, సాయంత్రం 5 గంటల నుంచి విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ కార్యక్రమాలు జరుగుతాయి. 14న మండపారాధన, దేవతాపూజ, స్థాపిత దేవత మూలమంత్ర హవనము, పుష్పా దివాసం, ధాన్యాదివాసం, మధ్యాహ్నం మదనానంద సరస్వతి పీఠం రాంపురం పీఠాధిపతి మాధవానంద సరస్వతిచే యంత్ర, విగ్రహాల ప్రతిష్ఠ, భక్తులకు అనుగ్రహభాషణం చేస్తారు. 15న మండప పూజ, గర్త సంస్కారం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, బలి హరణం తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి తెలిపారు.

నీలం మధు గెలుపు కోసం కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న ప్రవీణ్‌కుమార్ గుప్తా

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన నర్సారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ఉప్పల ప్రవీణ్ కుమార్ గుప్త కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మెడలో పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ త్వరలో మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, నాయకులు మనోజ్, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

బాలల కథ సంకలనానికి విద్యార్థిని ఎంపిక



శ్రావణి

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎర్ర శ్రావణి తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కథా సంకలనానికి ఎంపికైంది. విద్యార్థుల నుంచి సారస్వత పరిషత్తు బాలల కథా సంకలనం కోసం కథలను ఆహ్వానించింది. శ్రావణి ఈర్ష్య అనే కథ రాయడంతో ఎంపికైనట్లు హెచ్‌ఎం పెద్ది విఠల్ తెలిపారు. కథను రాయడానికి ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డిని, విద్యార్థిని అభినందించారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌కు చెందిన కాగ్నిజెంట్ టెక్నాలజీ సంస్థ నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు తీసుకోవడంతో పాటుగా, భవిష్యత్‌లో కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

జగదీష్ కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే హరీశ్‌రావు



జగదీష్ తల్లి పుష్పలతను ఓదారుస్తున్నహరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది గీత కార్మికుడు, బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మండలంలోని ముండ్రాయికి చెందిన జగదీష్ ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే హరీశ్‌రావు గ్రామానికి చేరుకొని జగదీశ్ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. జగదీశ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. క్రికెటర్‌గా, పార్టీ కార్యకర్తగా అందరి మన్ననలు పొందిన జగదీష్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, అతడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వృద్ధుడు, యువకుడు, అనారోగ్యంతో మరో వ్యక్తి చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు.



యాదయ్య (ఫైల్)

ములుగు(గజ్వేల్): బైక్ ఢీకొనడంతో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ములుగు ఏఎస్‌ఐ అండాలు తెలిపారు. మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన మురాడి పెద్ద యాదయ్య(60) వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన సైకిల్‌పై పొలానికి వెళ్లి రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి బైక్‌పై అతివేగంగా వస్తున్న బాల్‌రాజు సైకిల్‌ను ఢీకొట్టడంతో యాదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం వెంటనే లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో..



శంకర్ (ఫైల్)

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ అపూర్వరెడ్డి వివరాల మేరకు మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన ములుగు శంకర్ (38) రోజువారీ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం సిద్దిపేట నుంచి పుల్లూరు వస్తున్నాడు. ఈ క్రమంలో బండచేర్లపల్లి శివారులో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే శంకర్‌ను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీంతో పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిఫారసు చేశారు. గాంధీలో చికిత్స పొందుతూ శుక్రవారం పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ..



నర్సింహులు (ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. పట్టణానికి చెందిన శ్రీరాం నర్సింహులుకు మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ జాబితాలో పేరు వచ్చింది. ప్రభుత్వం లబ్ధిదారుడికి సొంతింటిని కేటాయించకపోవడంతో పట్టణంలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య గాంధీ ఆసుపత్రి నుంచి తప్పిపోవడంతో కుటుంబీకులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నర్సింహులు మృతదేహాన్ని గజ్వేల్ తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

స్వీయరక్షణకు కరాటే దోహదం

గజ్వేల్ సీఐ సైదా



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎస్‌ఐ సైదా

గజ్వేల్‌రూరల్: స్వీయ రక్షణకు కరాటే దోహదపడుతుందని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా షోటోకాన్ సిద్దిపేట ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని చాకలి ఐలమ్మ భవన్‌లో శుక్రవారం కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు అత్యవసర సమయాల్లో తమను తాము కాపాడుకోవచ్చన్నారు. విద్యార్థినులు, యువతులు కరాటే సాధన చేస్తే స్వీయ రక్షణకు దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. పోటీల్లో గజ్వేల్, జగదేవ్‌పూర్ నుంచి సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే జిల్లా చీఫ్ రాచకొండ ఆంజనేయులు, సౌత్ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, కౌన్సిలర్ చందు, నాయకులు నర్సింహులు, కరాటే మాస్టర్లు గోవింద్, లక్ష్మణ్, భాగ్యరాజు, పవన్‌కల్యాణ్, ప్రవలిక, రాజు, ఎల్లేష్, ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనలక్ష్మి జాతర



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన ధనలక్ష్మి అమ్మవారి జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజు గావు, బండ్లు, బోనాలు ఊరేగించారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇసుగారి నర్సయ్య, శ్రీనివాస్, యాదగిరి, భూమేశ్, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను శుక్రవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ యువగర్జన సభను విజయవంతంచేయాలి

తొగుట(దుబ్బాక): దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్‌ఎస్ యువగర్జన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని వీఆర్‌ఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే సభకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతాయని పేర్కొన్నారు. మండలంలోని యువత, విద్యార్థి, సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీగా సభకు తరలివెళ్లాలని ఆయన కోరారు.

◆ పండ్ల పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ క్లబ్, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని నిరాశ్రయుల ఆశ్రయంలో పండ్లను పంపిణీ చేశారు. శుక్రవారం వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు జిల్లా స్వరూప, సతీష్‌కుమార్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకు దుస్తులు, పండ్లు, బిస్కెట్, బ్రెడ్ ప్యాకెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, జిల్లా కార్యక్రమాల బాధ్యులు బెజగాం రాజయ్య, మర్యాల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

◆ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

గజ్వేల్‌రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వాసవీ మాత చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకులు శివకుమార్, భిక్షపతి, కౌన్సిలర్ మెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదర్శనగర్, రాజేందర్‌నగర్, మహాశక్తినగర్, మైత్రివనం, కొత్త బస్టాండ్, కాకతీయ నగర్, కిష్టసాగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

◆ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

కొండపాక(గజ్వేల్): అధికారం కోసం ప్రజలను మోసం చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ ట్రస్టు మాజీ చైర్మన్ యాదగిరి అన్నారు. మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ అధికారం కోసం ఆరు గ్యారంటీలంటూ ఓట్లు వేయించుకొని ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పార్టీలో చేరికలు, ప్రతిపక్ష నాయకులను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జిర్ర రాజు, సున్నం భాస్కర్, మల్లికార్జున్, భాస్కర్, అజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్



రెడ్డిపల్లిలో కవాతు చేస్తున్న పోలీసులు

నర్సాపూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ 2 శ్రీనివాస్, సీఐఎస్ఎఫ్ ఎస్‌ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో సివిల్, సీఐఎస్ఎఫ్ బలగాలు మండలంలోని రెడ్డిపల్లి, చిప్పల్‌తుర్తి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు చర్యలు చేపట్టామన్నారు.